# సహృదయులు

ఆకాశం నిర్మలంగా వుంది.

ప్రపంచం వెండితొడుగు తొడుక్కున్నట్టుగా, వెన్నెల భ్రమింపజేస్తోంది.

చల్లని పిల్లవాయువులు యెంతో హాయి కలిగిస్తున్నాయి.

ప్రకృతి ఇంత అందంగా, మనోజ్ఞంగా వున్నా, మేడ మీది గదిలో కిటికీ సరసను కూచునివున్న శోభకి మాత్రం అదే ప్రకృతి ఆనందాన్ని కలిగించలేకపోయింది.

కిటికీగుండా, బాహ్య ప్రపంచాన్ని తిలకిస్తూ, యేదో తలపోస్తూ, కూచుంది శోభ.

"శోభా..." అంటూ అప్పుడే ప్రవేశించింది పినతల్లి జానకమ్మ.

శోభ లేచి నించుంది.

"ఏం శోభా, ఒంటరిగా యిక్కడ కూచున్నావేం ?" అందామె.

"మరేం చెయ్యమంటావు పిన్నీ ! వంట్లో కాస్త అస్వస్థతగా వుంటేనూ యెక్కడికీ కదలబుద్ధి పుట్టడంలేదు."

"నేనుమాత్రం యెక్కడికి వెళ్లమంటున్నానని ? ఇలా యిక్కడ వంటరిగా కూచోకపోతే వెళ్ళి కిందిహాల్లో కూచో కూడదూ ! బావ వచ్చేవేళకూడా అయింది. నువ్వు వుత్సాహంగా వుండటం మాని, యిలా ఓ మూల కూచుంటే, వాడి మనస్సు యెంత బాధపడుతుంది ? నువ్వంటే వాడికి ప్రాణం. తెలుసా ? లేచి కిందకి పద..." అంది సౌమ్యంగానే.

శోభ యింకేమీ జవాబు చెప్పలేకపోయింది. ఆమె మౌనం వహించడానికి కూడా కారణం లేకపోలేదు. పిన్ని తనని ఆజ్ఞాపిస్తుందన్న భావంతో, జవాబుచెప్పలేదు. తన అయిష్టతను వెల్లడిచేసినా లాభం లేదనుకుంది. అందుకే, మెల్లగా కిందిగదికి నడిచిపోయింది. జానకమ్మ తృప్తిగా నవ్వుకుంది.

నిజానికి జానకమ్మ, శోభని ఆజ్ఞాపించలేదు. అసలు, ఆమె మాటల్లోకూడా కరకుదనం యెక్కడా వెదికితే అగుపించడంలేదు. శోభంటే ఆమెకీ అభిమానంవుంది. ఆ అమ్మాయి తన కూతురు కాకపోయినా, స్వంత కూతురులానే చూచుకుంటోంది. శోభవంటి వుత్తమురాలు, తన తమ్ముడికి తగిన భార్య కాగలదని ఆమె అభిప్రాయపడింది. ఈ విషయం ఆమె మనసులో చాలా రోజుల్నించి దాగునివుంది. అయితే తల్లిదండ్రులతో మాత్రం యిటీవలనే చెప్పింది. వాళ్లు ఒప్పుకున్నారు. భర్తకూడా కాదనలేదు. బావమర్ది నాలుగైదు సార్లు వచ్చినప్పుడు అతడి మనస్తత్వం బాగా చదివాడు గనుక, సంతృప్తిగా 'వూ' కొట్టాడు. జానకమ్మలానే ఆ కుటుంబ

మంతా సహృదయులనే ఓ నమ్మకం కూడా అతనిలో నాటుకు పోయింది.

శోభ పదిహేనేళ్ళ అమ్మాయిగా వుంటున్నప్పుడు ఆమె తల్లి పరమపదించింది. తండ్రి ముకుందరావు పెళ్ళి చేసుకో కూడదని తీర్మానించుకున్నాడు. కాని, స్నేహితులూ, బంధు వులూ ఒకటే పట్టుదలతో అతణ్ణి నచ్చ జెప్పడానికి ప్రయత్నిం చారు. శోభ అత్తారింటికి వెళ్ళిపోయాక, అతని మంచిచెడ్డలు చూసేవాళ్లు యింకెవరున్నారన్న నమ్మకాన్ని అతనికి కలిగించి, ఆ సమస్య లేకుండా వుండాలంటే పునర్వివాహం చేసుకోవాల న్నారు...ముకుందరావు చివరికి ఒప్పుకోక తప్పిందికాదు. కాని, ఒక షరతు మాత్రం పెట్టాడు. అలా అయితే వితంతువునే వివాహం చేసుకుంటాను అని. సరేనన్నారు స్నేహితులూ – బంధువులూను. ఆ వివాహమే జానకమ్మతో జరిగింది...జానకమ్మ వితంతువు. ఆమె వయస్సు రెండో పెళ్ళినాటికి ముప్ఫయి రెండు సంవత్సరాలకు తక్కువుండదు. అయినా, ముకుందరావు నచ్చి పెళ్లి చేసుకున్నాడు. ఇప్పుడామె యెంతో లక్షణంగా లక్ష్మిలా కనిపిస్తోంది.

శోభకూడా పినతల్లిపట్ల యెంతో గౌరవం చూపేది. ఆమె యేనాడూ సవతితల్లిలా ప్రవర్తించక పోవడమే యిందుకు కారణమేమో! కాని, యిప్పుడీ పెళ్ళి ప్రసక్తిలో మాత్రం పినతల్లి స్వార్థం చూపిస్తుందేమో నని ఆమె భయపడింది. అయినా యేం చేస్తుంది? స్వంతతల్లి గనుకనా, తన మనసులో

వున్న మాట చెప్పకోడానికి! ... అనుకుంటూ హాలులోకి పోయింది.

హాలంతా యెంతో ఆకర్షణీయంగా వుందారోజు. నిశ్శబ్దం ఆవరించుకుని వుంది. టేబిలు దగ్గర కూచుని దానిపై వున్న యింగ్లీషు పత్రిక తిరగవేస్తూవుంది శోభ యేమీతోచక. ఆమె మెదడునిండా ఆలోచనలే. బావ వస్తే, ఆయనతో ఎలా సంచరించడం? తను ముభావంగా వుంటే, ఆయనేం అనుకుంటాడు? యిలా ఆమె ఆలోచిస్తోంది.

'టకటక' బూట్లశబ్దం వినిపించింది. శోభ గుండెలు కొట్టుకున్నాయి. బావేగామోసు వస్తున్నాడు అనుకుంటూ పుస్తకం పుటల్ని గబగబ తిప్పడం ప్రారంభించింది. బూటు చప్పుడు కాస్త మందకొడిగ వినిపించింది. కాని, దగ్గరపడింది. వెనక్కి తిరగాలనివున్నా, మనస్కరించక అలానే వూరుకుంది.

"శోభా..." మెల్లగా పిలిచిందా పిలుపు.

శోభ గతుక్కుమంది. ఆ స్వరం బావది కాదని ఆమెకి తెలుసు. ఆ స్వరం సుపరిచితమైనదే! చప్పున వెనక్కి తిరిగింది. ద్వారం దగ్గర మధు! ఆమె కళ్ళను ఆమె నమ్మలేకపోయింది.

"మధూ! నువ్వా..." అంది మెల్లగా.

"ఔను శోభా! నీకు ఆశ్చర్యంగా వుందికదూ? మీ యింటికి ఎప్పుడూరానని నీకు మాటిచ్చిన మాట నిజమే. కాని, నేనివ్వాళ హైద్రాబాద్ వెళ్తున్నాను. ఈ కబురు నీతో చెప్ప

డానికే రావలసి వచ్చింది. లేకపోతే నన్ను గురించి నువ్వేమనుకుంటావో యెవరికి తెలుసు ? మళ్ళీ నేను తిరిగి వచ్చేసరికి పదిహేను రోజులైనా అవుతుంది...నేను తిరిగి వచ్చాక, మీ నాన్నతో అన్ని విషయాలూ మాట్లాడతాను. ఏమంటావు ?” అంటూ చెప్పుకుపోయాడు మధు.

శోభ ఓ సారి మేడమెట్లకేసి చూసింది— పిన్ని వస్తున్నదేమోనని. ఎవరూ అక్కడ లేరు...ధైర్యం కూడగట్టుకుంది. అయితే, మధుకి తను యేం జవాబు చెప్పడమో, ఆమెకి అర్థంకాలేదు. తన పరిస్థితికి లోలోపల యెంతో యేడ్చింది... ఈ పదిహేను రోజుల్లో తన భవిష్యత్తు యెలా పరిణమిస్తుందో ఆ భగవంతుడికే తెలియాలి...లేకపోతే తను మధుతో హైద్రాబాద్ వెళ్ళిపోతే ?... అన్న ఆలోచనకూడా కలిగిందామె మెదడులో. కాని, కుటుంబ గౌరవం, తండ్రి హోదా, అన్నీ గుర్తుకువచ్చి, భయపెట్టాయి.

మధు, శోభ మౌనానికి అర్థం తెలుసుకోలేక సతమతమౌతున్నాడు. చివరికి అతను వూహించిందంతా, ఆమె తను హైద్రాబాద్ వెళ్తున్నందుకు బాధపడుతుందని.

“పదిహేను రోజుల్లో తప్పకుండా వస్తాను శోభా ! నువ్వేమీ కంగారుపడకు. ఏం చెయ్యను ? అవసరంగా వెళ్ళాల్సి వచ్చింది వస్తామరి...అవతల నాకు వేళవుతోంది...” అంటూ చరచరా వెళ్ళిపోయాడు.

శోభకి మేడుపొచ్చినంత పనయింది. కాని మేడపలేక కుప్పలా కూలబడి పోయింది కుర్చీలో. ఆమె హృదయంలో తుఫాను చెలరేగింది. 'భగవాన్! ఏమిటీ విషమ సమస్య !" అనుకుంటూ తలపోసింది మనస్సు.

గడియారం యెనిమిది గంటలు కొట్టింది. ప్రతి గంటా ఆమె హృదయంపై సమ్మెటపెట్టులా తగిలి బాధించింది. మేడ మెట్లమీంచి హుందాగా దిగుతూ వచ్చింది జానకమ్మ. "వీడు యింతవరకూ వచ్చాడు కాడేం చెప్మా?" తనలో తనే అనుకుంటూ ముందుకు వస్తున్నంతలో బైట బూటు చప్పుడు వినిపించింది.

క్షణం తర్వాత ప్రభాకరం లోనికి ప్రవేశించాడు. అతని మొహం ప్రకాశవంతంగా వుంది. చేతిలోవున్న లెదర్ బాగ్ బల్లమీద పెట్టి,

"ఏమక్కా, నాకోసమే యెదురుచూస్తున్నట్టున్నావు?..." అన్నాడు మందహాసం చేస్తూ.

శోభ లేచి నుంచుంది. ఆమె గుండెలు విపరీతంగా కొట్టు కుంటున్నాయి. తనేదో తప్పు చేసినట్టుగానే మొహం దించు కొని వుందామె.

"పదరా మేడమీదికి..." అంది జానకమ్మ.

ప్రభాకరం శోభ కేసి చూశాడు మందహాసంతో. కాని, ఆమె మొహం దించుకొని వుండటం అతని కేమీ అర్థం కాలేదు.

"ఏమిటి శోభా, అలా మొహం దించుకొని వున్నావు ?" అన్నాడు విస్తుపోతూ.

జానకమ్మ నిట్టూర్చింది.

"సిగ్గురా...మరింకేమీ లేదు..." అనేసింది.

పిన్ని అలా అనడంలో అంతరార్థం యేమిటో శోభకే అవగాహన కాలేదు. తన అభిప్రాయం, ఆమె గ్రహించేసిం దేమోనన్న అనుమానంకూడా కలిగింది.

"ఇంక, యీ సిగ్గు యెన్నాళ్లులే...ఆ మూడుముళ్లు పడేవరకే..." అంటూ చరచరా మేడమీదికి వెళ్లిపోయాడు.

"శోభా, వంటగదికి ఓసారి రా..." అంటూ వంట గదికేసి నడిచింది, జానకమ్మ.

శోభ ఆమెను అనుసరించింది. జానకమ్మ కాఫీ, టిఫినూ తనేపట్టుకొని బైలుదేరింది తమ్ముడి దగ్గరికి, "పొయ్యిమీద పాలున్నాయి...కాస్త చూస్తూవుండుశోభా." అని చెప్తూ.

పినతల్లి ధోరణి శోభని ఆశ్చర్యంలో ముంచింది. టిఫిను తనచేత యెందుకు పంపలేదో, యెంత ఆలోచించినా వూహాకి అందలేదు. అయినా, తను ప్రభాకరం వచ్చినపుడు మొహం ముడుచుకుని వుండటం, ఆయనకి జవాబు చెప్పక పోవడమూ చాలా అసందర్భంగా వున్నట్టు తోచింది. ఆ విషయంలో తను తప్పు చేసిందేమోనని యిప్పుడనుకుంది. ఇప్పుడనుకొని

ప్రయోజనం కూడ లేదని ఆమెకి తెలుసు. అందుకే ఓ నిట్టూర్పు విడిచి వూరుకుంది.

"ఏమక్కా, నువ్వు తెచ్చావు కాఫీ? శోభ యేం చేస్తోంది?" అన్నాడు ప్రభాకరం వుత్సాహంగా. అంతవరకూ అతను శోభ వస్తుందనే యెదురు చూశాడు పాపం. ఆమెతో కబుర్లు చెప్పుకొని కూచోవాలని తహతహ లాడాడు. కాని, వూహలన్నీ మట్టిగొట్టుకు పోయాయి. అందుకే తెగించి అక్కయ్యను ఆ ప్రశ్న అడిగేశాడు.

జానకమ్మ మాత్రం యేం చెప్తుంది? ఒక్క నిట్టూర్పు విడిచింది. తమ్ముడికి నిరాశ కలిగించడం ఆమెకి యెంతో బాధనిపించింది. అయినా యింకా శోభపై ఆశపెట్టుకుని తమ్ముడు కలలుగనడం అంత మంచిదికాదని భావించింది.

"ఒరేయ్ తమ్ముడూ! నీతో ఒక్క విషయం చెప్పాలి!" మెల్లగా అంది.

"చెప్పక్కా!" ఆసక్తిగా చూస్తూ అన్నాడు ప్రభాకరం.

"శోభమీద ఆశ వదులుకో!" అందామె.

ప్రభాకరం తృళ్లిపడ్డాడు. అక్కనోట ఆ మాట వస్తుందని అతనెప్పుడూ అనుకోలేదు.

"అదేమిటక్కా! మొన్న మొన్నటి వరకూ శోభనే పెళ్ళిచేసుకోమని ఒకటే నచ్చచెప్పావు. మళ్ళీ యింతలో

యిలా మారిపోయావేమిటి ? ఆశ వదిలిపెట్టుకోవడ మెందుకు ? బావకి యిష్టంలేదా ? లేక శోభ విముఖత చూపిస్తోందా ?"

"శోభ ముఖావంచూసి, నేను యేమిటో అనుకున్నాను. ఏదో చెప్పలేక బాధ పడుతోందని అప్పుడప్పుడు అనిపించేది. ఆ రహస్యం యివ్వేళ తెలిసింది."

"ఏఁవిటది ?" ఆత్రంగా అడిగాడు.

"ఆమె ఒక అబ్బాయిని ప్రేమిస్తోంది."

"ప్రేమిస్తోందా !" హతాశుడై అన్నాడు ప్రభాకరం. కట్టుకున్న ఊహాసౌధాలన్నీ ఒక్కుమ్మడి కూలిపోయినయ్. అతని ముఖ కవళికలు చప్పున మారిపోయినయ్.

"ఔను ! నీతో చెప్పకూడదనే అనుకున్నాను. కాని, నువ్వు యింకా ఆమెపట్ల అభిమానాన్ని పెంచుకుంటూ వుంటావనీ, అది భవిష్యత్తులో విపరీత పరిణామానికి దారి తీస్తుందనీ భయపడి చెప్పక తప్పిందికాదు. శోభ అభీష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించడంకూడా మంచిదికాదు. అలా ప్రవర్తించిన పక్షంలో సవతితల్లి బుద్ధి చూపించుకుందన్న అపవాదు నాకు తథ్యం. నువ్వూ ఆలోచించు...మనసులేని మనువు సాధ్య పడుతుందా ? అప్పుడు యిద్దరిలో ఏ ఒక్కరూ సుఖపడలేరు. ఆమెసుఖాన్నయినా వాంఛించడం మనధర్మం! ఏమంటావురా?" యెదురు ప్రశ్న వేసింది జానకమ్మ.

అక్కయ్య సహృదయాన్ని అర్థం చేసుకున్నాడు సహృదయుడైన ప్రభాకరం. అక్క చెప్పిందంతా సబబుగానే వున్న

ట్లనిపించింది. అవుతే తను శోభమీాద పెట్టుకున్న ఆశేమిటి ? అవన్నీ వట్టి స్వప్నాలేనా ? అదే అతని అంతరాళంలో మెదిలిన ప్రశ్న. స్వప్నాలే అనుకుని మర్చిపోవాలి మరి... అనుకున్నాడు.

"నీతో యేకీభవిస్తున్నానక్కా. స్వార్థంతో పరిస్థితుల్ని అనుకూలపర్చుకుని ఆ అమాయిక ముగ్ధ జీవితంలో తుఫాను రేపడం నాకూ యిష్టంలేదు. నేను పెళ్ళిచేసుకుందుకు పిల్లే లేక పోతుందా ? ఆమె ఆనందానికే దోహదమిద్దాం..." అన్నాడు.

జానకమ్మకి తెలుసు తమ్ముడు మంకుపట్టు పట్టడని. తమ్ముడిది కూడా తనలాంటి మన స్తత్వమే.

"నువ్వు ఒప్పుకుంటావని నాకు తెలుసు !''

"ఇంతకీ ఆ అబ్బాయిని నువ్వు చూశావా ?"

"చూశాను. బాగానే వుంటాడు. హైదరాబాద్ వెళ్తూ చెప్పడానికి వచ్చాడు. పాపం, శోభ యేమీా జవాబు చెప్ప లేకపోయింది. ఔనుమరి— యెలాచెప్తుంది ? తనని నీకు ముడి పెడతామని తెలుసుకుందిగా! సందిగ్ధావస్థలోపడి మౌనం వహిం చక తప్పిందికాదు. పాపం, ఆ పసిహృదయంలో యెంత సంక్షోభం చెలరేగిందో యెవరికి తెలుసు !''

"పోనీ అక్కా, యిప్పుడు మనం ఆ సంక్షోభాన్ని పటా పంచలు చేద్దాం...''

''శోభకి అప్పుడే యేమీా తెలియనివ్వొద్దు. మీా బావతో మాట్లాడి చూద్దాం రేపు...''

"సరే... అలాగే కానీయ్..." అంటూ టిఫిను తీసుకోవడం ప్రారంభించాడు ప్రభాకరం.

జానకమ్మ అక్కణ్ణించి కిందికి వచ్చేసింది.

*　　　*　　　*

మరుసటిరోజు ఆదివారం. ముకుందరావు యింట్లోనే వున్నాడు. మేడమీది గదిలో న్యూస్‌పేపరు చదువుకుంటున్నాడు. శోభ వంటింట్లో వుంది. ప్రభాకరం క్రింది హాల్లో ఓ యింగ్లీషు నవల చదువుతూ కూచున్నాడు. శోభ తనకి కాకుండా పోతుందే అన్న బాధ అతనికి అప్పుడప్పుడూ గుర్తుకు వస్తుంది. వచ్చినప్పుడంతా చిన్నగా నవ్వుకుంటున్నాడు. శోభ వంటి అమ్మాయిని భార్యగా పొందే అదృష్టం తనకి లేదని వేదాంతిలా తృప్తిపడేవాడు.

అతను చదువుతున్న నవల మంచి పట్టునవుంది. ఏక బిగిన పేజీలు తిరిగిపోతున్నాయి.

టకటక బూటు చప్పుడు...... తలెత్తి చూశాడు ప్రభాకరం. ద్వారం దగ్గర ఓ యువకుడు తబ్బిబ్బవుతూ నుంచున్నాడు. అతని మొహంలో యెంత ఆనందం వుందో అంతా పాలిపోయింది. ప్రభాకరం అతనికేసి పరిశీలనగా చూశాడు. ఆయన బాగానే వున్నాడు.

"ఎవరు కావాలండీ?" ప్రశ్నించాడు ప్రభాకరం లేస్తూ.

ఆ వ్యక్తి చప్పున జవాబు చెప్పలేకపోయాడు. అధికంగా తబ్బిబ్బవ్వడంకూడా శ్రేయస్కరం కాదనుకున్నాడో యేమో—

"ముకుందరావుగారున్నారాండీ?" అన్నాడు. నిజానికి అతను వచ్చింది శోభను కలుసుకోవడానికేగాని, ముకుందరావు కోసం కాదు. అయినా, ప్రభాకరం యెదుట, శోభకోసం వచ్చానని చెప్పలేకపోయాడు.

"కూర్చోండి పిలుస్తాను..." అన్నాడు ప్రభాకరం.

కొంప మునిగిందనుకున్నాడు ఆ వ్యక్తి. ముకుందరావు యింట్లో వుండడేమోనని యిలా చెప్పాడేగాని, లేకపోతే చెప్పకపోను.

"మళ్ళీవచ్చి కలుసుకుంటానండి!" అని పోబోయాడు.

ప్రభాకరంకి, ఆ యువకుని ధోరణి యేమీ అర్థంకాలేదు. మెదడుకి కాస్త పనికల్పించేసరికి, విషయం బోధపడింది. అసలు, యీయన శోభకోసం వచ్చినవాడై వుంటాడని నిర్ణయించుకోవడానికి అతనికి యెంతోసేపు పట్టలేదు.

"వెళ్ళిపోకండి. నిజం చెప్పండి. మీరు వచ్చింది యెవరికోసం? శోభకోసంకాదూ? చెప్పడానికి మీరేం సంకోచించకండి..." అన్నాడు మళ్ళీ ప్రభాకరం.

ఆ యువకుడు విధిలేక ఔనన్నట్టుగా తలూపాడు.

"మంచివారేనండీ! ఇంతగా భయపడితే యెట్లా! మీ పేరు?"

"మధు..."

"సరే...రండి ... కూచోండి ..." అంటూ అతణ్ణి రెక్కపట్టుకుని తెచ్చి కూర్చోబెట్టాడు.

"మీరు హైద్రాబాద్ వెళ్ళారని విన్నానే!"

మధు ఈ ప్రశ్నకి మరింత విస్తుపోయాడు. ఈయనకి తన ప్రోగ్రాం యెలా తెలిసింది చెప్మా!

"మీ కెలా తెలిసింది?"

అప్పుడే వంటగదిలోంచి హాల్లోకి వచ్చిన జానకమ్మ "నేను చెప్పాను..." అంది.

మధుకి వళ్ళంతా చెమట పోసింది. తను అనవసరంగా వుచ్చుల్లో యిరుక్కున్నాడనిపించి, భయం పుట్టింది.

"అయితే, మీరు హైద్రాబాద్ వెళ్ళలేదా?" మళ్ళీ ప్రశ్నించాడు ప్రభాకరం.

"లేదండీ! అనుకోకుండా ప్రయాణం తప్పింది. ఆ విషయమే శోభకి చెప్పాలని వచ్చాను..." అన్నాడు మధు.

వంటగదినుండి యేదో పనిమీద బైటికి వచ్చిన శోభ మధుగొంతు విని హాలువెనుక ద్వారంగుండా చూసింది. నిజంగా మధే. ఆమెకి కళ్లు తిరిగినట్టయ్యాయి. మధు, పిన్ని బావల మధ్య పడ్డాడేంటి? కొంప ముంచేశాడు...తన బ్రతుకు వీధినపెట్టాడు. తన గురించి వాళ్లేం అనుకుంటారు? పిన్ని యెన్ని శాపనార్థాలు పెడుతుందో! యివే ఆమె మెదడులో రైళ్ళలా ఢీకొంటున్న

ప్రశ్నలు. ఏం జరుగుతుందో ఆమెకి అంతా అయోమయంగా కనిపిస్తోంది.

ప్రళయం ముంచుకొస్తున్నట్టుగా అప్పుడే తండ్రికూడా మేడ మెట్లు దిగుతుండటం చూసిన శోభకి మూర్ఛ వచ్చినట్లయింది. ఇదేదో అనర్థానికే దారితీస్తుందన్న నిర్ణయానికి వచ్చేసింది. ఆపాదమస్తకం వణికిపోతోందామె.

"రండి బావా! సరిగ్గా మీరూ సమయానికే వచ్చారు." అంటూ ముకుందరావును ఆహ్వానించాడు ప్రభాకరం.

మధు అవస్థ యెలావుంటుందో, మనం వూహించుకోవాలే గాని, రాయడం సాధ్యపడదు. అతని గుండెలు జోరుగా కొట్టుకోసాగాయి. తను యిప్పుడు యెటువంటి అవమానానికి తల వొగ్గాల్సి వస్తుందోనని కృంగిపోయాడు.

ముకుందరావు దగ్గరగావస్తూనే మధుని చూసి అదోలా మొహంపెట్టి,

"ఏం అబ్బాయ్—నువ్వు లింగమూర్తి కొడుకువి కాదూ?" అని ప్రశ్నించాడు.

మధు గుండెలు కాస్త తాపీపడ్డాయి.

"అవునండీ!"

"అయితే మీకీ అబ్బాయి తెలుసునన్నమాట..." అంది జానకమ్మ.

"తెలియడమంటే, యీ అబ్బాయితో నాకేమీ పరిచయం లేదనుకో! వీళ్ళ నాన్నతో బాగా పరిచయముంది. అన్నట్లు అబ్బాయ్, నువ్వు 'లా' పాసయ్యి అప్రెంటిస్‌గా వుంటున్నావట కదూ?"

"ఔనండి!'

"సరేగాని, యేఁవిలా వచ్చావు? మీ నాన్నగాని, నన్ను రమ్మని కబురు పంపాడా?"

ప్రభాకరం చిన్నగా నవ్వాడు.

"వాళ్లనాన్న మిమ్మల్ని రమ్మని కబురు పంపలేదుగాని, యిప్పుడు మాత్రం మీరు వాళ్ళ నాన్నకోసం కబురు పంపక తప్పదు" అన్నాడు.

ఇదో బెదిరింపులా వినిపించింది మధుకి. మరింత గాభరా పడ్డాడు.

"అంటే యేమిటోయ్ నీవుద్దేశం?" అన్నాడు ముకుందరావు.

"అక్కా నువ్వు చెప్పేసెయ్ తతిమ్మా దంతా..." అన్నాడు ప్రభాకరం.

"ఏం లేదండీ! మన శోభను యీ అబ్బాయికి పెళ్లి చేసే యేర్పాటు చేయండి..." నవ్వుతూ అంది జానకమ్మ.

"ఏమిటి నువ్వంటున్నది జానకీ!" అర్థంకాక అన్నాడు ముకుందరావు.

"ఇదేం పరిహాసం కాదండీ! నిజం చెప్తున్నాను. వీళ్లిద్దరూ ప్రేమించుకున్నారు. అమ్మాయి బాగుపడాలంటే, మనం యీ యేర్పాటు చెయ్యక తప్పదు."

"మరి...ప్రభాకరంకిచ్చి చేస్తామన్నాంగా!"

"శోభ మనస్సు తెలుసుకోక ముందు అలా అనుకున్నాం. కాని, మనసులోమాట తెలుసుకున్నాక కూడా మంకుపట్టుతో ప్రయత్నం కొనసాగించడం తెలివితక్కువతనమే! తమ్ముడు కూడా అదే అభిప్రాయంతో వున్నాడు..." అంది జానకమ్మ.

"అవును బావా! నా స్వంత మేనకోడలే అయితే, ఆమె శ్రేయస్సు చూసే బాధ్యత నాది కాదూ? అలాగే అను కుంటాను. ఇటువంటి విషయాల్లో స్వార్థానికి తావుండకూడదు. నేను కోరేదంతా శోభ సుఖమే!" అన్నాడు ప్రభాకరం.

ముకుందరావు కళ్ళు ఆనందాశ్రువులతో చెమ్మగిల్లాయి. అక్కా, తమ్ముడూ, యెంత సహృదయులు అనుకున్నాడు. సవతితల్లి పిల్లలను నానా హింసలు పెడుతుందనీ, వారి భవి ష్యత్తును నాశనం చేస్తుందనీ అందరూ అనడమే విన్నాడుగాని యెప్పుడూ కళ్ళరా చూడలేదు. అయితే యిప్పుడతను చూస్తు న్నది మాత్రం అందుకు విరుద్ధంగా వుంది. అందుకే, ఆ చెప్పిన వాళ్లందరూ అసూయతో చెప్పేవారేమోనన్న నిర్ణయానికి వచ్చాడు. భార్యను, బావమర్దిని మనసులో అభినందించకుండా వుండలేకపోయాడు.

"మీ యిద్దరూ చెప్తున్నప్పుడు నేను మాత్రం కాదంటానా జానకీ. అలాగే చేద్దాం" అన్నాడు ముకుందరావు.

మధు హృదయభారం తగ్గింది. వుత్సాహం వురకలు వేసింది. చప్పున ప్రభాకరంని కౌగలించుకుని "మీ వంటి సహృదయులు చాలాఅరుదుగా వుంటారండీ! మీకు యెప్పుడూ నేను కృతజ్ఞుణ్ణే" అన్నాడు.

ప్రభాకరం, మధుని తడుతూ "అబ్బే! అంత భారం నామీద వెయ్యకండి. మోయడం కష్టం." నవ్వుతూ అనేసి "మా శోభ కూడా అదృష్టవంతురాలే" అన్నాడు.

మధు మొహం దించుకుని నవ్వుతూ "మరి నాకు శల విప్పించండి" అంటూ నిష్క్రమించబోయాడు.

"అన్నట్టు, మీ నాన్నతో చెప్పవోయ్ నేను సాయంత్రం వస్తున్నట్టు..." అన్నాడు ముకుందరావు.

మధు తలూపి వెళ్లిపోయాడు. "మీ అమ్మాయి మంచి వాణ్ణే సెలక్ట్ చేసుకుంది, బావా!" నవ్వుతూ అన్నాడు ప్రభాకరం.

జానకమ్మ లోపలికి నడిచింది. చాల సేపట్నించి ద్వారం దగ్గరే నుంచుని వింటున్న శోభ అక్కణ్ణించి వంటగదికేసి నడక సాగించింది. కాని, జానకమ్మ కంటబడింది.

"అమ్మదొంగా! అంతా వింటున్నావన్నమాట..." అంది జానకమ్మ నవ్వుతూ.

శోభ చప్పున వెనక్కి తిరిగి పిన్నిని కౌగలించుకుంటూ "అమ్మా" అంది ఆనందాంబుధిలో తేల్తూ.

జానకమ్మకు ఆ పిలుపు అమితానందాన్నిచ్చింది. శోభ తల నిమురుతూ "నువ్వు చాలా అదృష్టవంతురాలవు శోభా" అంది.

"నాన్న రమ్మంటున్నారు..."

"నేను రాలేను పిన్నీ...సిగ్గేస్తుంది..." అంటూ వంట గదికేసి పోయింది శోభ.

జానకమ్మ నవ్వుకుంటూ హాల్లోకి వచ్చేసి "రానంటుం దండీ! అప్పుడే సిగ్గుదొంతరలు చుట్టుముట్టాయి..." నవ్వుతూ అంది.

"నిజమే మరి! పెళ్ళికూతురు కాబోతుందిగా! ప్రభా కరం, పెళ్ళి జరిగేవరకూ నువ్వు యిక్కడే వుండిపోవాలిసుమా!"

"ఓ! దానికేం! కలకాలం వుండిపొమన్నా వుండి పోతా..." నవ్వుతూ అన్నాడు.

ముగ్గురూ ఒక్కసారి నవ్వేశారు...

వంటగదిలో వున్న శోభ కూడా చిన్నగా నవ్వుకుంది.